క్లుప్తంగా

భూసార పరీక్షలపై అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ ఏఓ

శిరివెళ్ల: స్థానిక రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలపై నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాల టెక్నికల్ ఏఓ నాగేంద్ర గురువారం సచివాలయ వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. మే నెలలో రైతుల పొలాల్లో మట్టి సేకరించి పరీక్షలు ప్రారంభించాలన్నారు. ఫలితాలను బట్టి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

శిరివెళ్ల: వైఎస్సార్ షాదీ తోఫా- వైఎస్సార్ కల్యాణమస్తుకు కొత్తగా 25 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. మహదేవపురం, బోయలకుంట్లలో మూడు చొప్పున దరఖాస్తులు అందాయన్నారు. గోవిందపల్లె 5, శిరివెళ్ల 7, యర్రగుంట్లలో 2, కోటపాడు 4, గంగవరంలో ఒక దరఖాస్తు అందిందన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయుల నియామకం

ఉయ్యాలవాడ: మండలంలో ఖాళీగా ఉన్న మూడు పాఠశాలలకు 1998 డీఎస్సీలో అర్హత పొందిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం బాధ్యతలు స్వీకరించారు. సర్వాయిపల్లె ప్రాథమిక పాఠశాల స్పెషల్‌కు సుదర్శనరెడ్డి, ఆర్.పాంపల్లె, అల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలకు చిన్న నర్సిరెడ్డి, అబ్దుల్‌రజాక్‌లు విధుల్లో చేరినట్లు ఎంఈఓ అనురాధ తెలిపారు.

ఉపాధి పనులకు ఆమోదం

శిరివెళ్ల: 2023-24 ఆర్థిక సంవత్సరానికి మండలంలో చేపట్టవలసిన ఉపాధి పథకం కొత్త పనులకు ఉన్నతాధికారులు ఆమోదం తెలిపారని ఏపీఓ రామసుబ్బయ్య గురువారం తెలిపారు. 10 గ్రామ పంచాయతీలలో 329 పనులు చేసేందుకు అనుమతులు జారీ అయ్యాయన్నారు. శిరివెళ్లలో 27 పనులకు రూ.29.91 లక్షలు,గంగవరం 30 పనులకు రూ.45.87 లక్షలు,కోటపాడు 35పనులకు రూ.22.97 లక్షలు, జీనేపల్లె 60 పనులకు 60.12 లక్షలను అనుమతులు జారీ అయ్యాయన్నారు. కామినేనిపల్లె 20 పనులకు రూ.46.87 లక్షలు, బోయలకుంట్ల 31 పనులకు రూ.59.63 లక్షలు, వనికిని దిన్నె 16 పనులకు రూ.23.81లక్షలు, గోవిందపల్లె 32 పనులకు రూ.73.41 లక్షలు, మహదేవపురం 27 పనులకు రూ.34.78 లక్షలు, గుంప్రమాన్‌దిన్నె 51 పనులకు గాను రూ.1.63 కోట్ల ఖర్చు చేయడానికి అనుమతులు జారీ అయ్యాయన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

శిరివెళ్ల: ఆరోగ్య సమస్యలతో ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు కోలుకోలేక గురువారం మృతిచెందాడు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఇసుకపల్లెకు చెందిన కుప్పం మునిస్వామి (22) వ్యవసాయకూలిగా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంత కాలంగా మానసిక సమస్యలతో సతమతమవుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 12న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నంద్యాల శాంతిరాం వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య నాగలలిత, ఏడాదిన్నర కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కాఫీ పొడితో అంబేడ్కరుడు



నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి మాణిక్యరావు కాఫీ పొడితో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని గీశారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని 3 గంటలు శ్రమించి చిత్రాన్ని గీసినట్లు మాణిక్యరావు తెలిపారు.

వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు

రుద్రవరం: అడవీ ప్రాంతంలో నివసించే వన్యప్రాణులు చుట్టుపక్కల పొలాల వైపు వస్తే వాటికి ఎలాంటి హాని తలపెట్టొద్దని చెలిమ రేంజ్ అధికారి ఈశ్వరయ్య కోరారు. మండల పరిధిలోని డి.కొట్టాల, శ్రీరంగాపురం గ్రామాల్లో ఆయన రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తరచూ అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు సంభవించాయని దీంతో ఆహార కొరత ఉండవచ్చన్నారు. పెరుగుతున్న ఎండలకు వాగులు, వంకల్లో నీరు లేక మూగజీవాలు అటవీ ప్రాంతం నుంచి బయటకి వచ్చే అవకాశం ఉందన్నారు. అలాంటి వాటికి హాని తలపెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్టర్లు శ్రీనివాసులు, ఎల్లమ్మ, ఎఫ్‌బీఓలు నాగప్ప, రామేశ్వరి ఉన్నారు.

☛ ఇక్కడ కనిపిస్తున్న ఈ వృద్ధురాలి పేరు దూదేకుల సిద్దమ్మ. ఆళ్లగడ్డ మండలం కొండంపల్లి గ్రామం. నా అనే వారు ఎవరూ లేరు. ఈమె ప్రతి నెల రేషన్ తెచ్చుకోవాలంటే సుమారు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న బాచేపల్లి గ్రామం వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వచ్చేది. ఈ వయసులో నడిచిపోలేక ప్రతి నెలా ఎవరో ఒకరిని బతిమిలాడి వారి వెంట వెళ్లి అక్కడ రేషన్ తీసుకుని గ్రామానికి చేరుకునేది. 'ఒంటరినైన నాకు ఈ బియ్యం తప్ప వేరే అవకాశం లేదు. ఈ బియ్యం తెచ్చుకోవాలంటే ప్రతి నెలా నరకయాతన పడేదాన్ని. ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇవ్వడం కలగా ఉంది. ఇలా వస్తాయని ఎప్పుడూ అనుకోలేదు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటా' అంటూ సిద్దమ్మ తన భావాన్ని వ్యక్తం చేసింది.



☛ సరుకులు తీసుకుని వెళ్తున్న ఈ మహిళ పేరు భీమమ్మ. బాచేపల్లి తండా. ఈమె ప్రతి నెలా రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే సుమారు 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న బాచేపల్లికి వెళ్లాల్సి వచ్చేది. సరుకులు తెచ్చుకోవాలంటే రూ.300 కూలీ పోగొట్టుకునేది. తీరా అక్కడికి వెళ్లే సరికి ఆరోజు సరుకులు వేయడంలేదని చెబుతే మరుసటి రోజు వెళ్లేది. ఇలా రెండు నుంచి నాలుగైదు సార్లు తిరిగిన సంఘటనలూ ఉన్నాయి. 'పనికి వెళ్లక పోతే రూ.300 నష్టపోతాం. అయినీ సరుకులు తెచ్చుకోక పోతే తినడానికి తిండి ఉండదు. దీనికి తోడు కార్డు తీసేస్తారని భయం. అందుకే ఎంత కష్టమైనా వెళ్లి సరుకులు తెచ్చుకునేదాన్ని. ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి సరుకులు అందజేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది' అని భీమమ్మ తెలిపింది.



ఇంటింటా ఆనందం

- మొబైల్ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



నేడు ఇంటి వద్ద రేషన్ అందజేస్తున్న దృశ్యం



నాడు రేషన్ దుకాణం వద్ద నిరీక్షిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకులు తీసుకోవాలంటే గతంలో ఎన్నో నిబంధనలు. సర్వర్ సక్రమంగా పనిచేయకపోయినా.. ఏదైనా సమస్య తలెత్తినా గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఒక్కోసారి పనులకు వెళ్లకుండా రెండు, మూడు రోజులు పాటు రేషన్ షాపులకు వెళ్లాల్సిన దుస్థితి ఉడేది. కూలి పనులకు వెళితే గాని కడుపు నిండని కుటుంబాలు ఎన్నో. వారంతా రేషన్ షాపుల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చినప్పుడు ఆదాయం కోల్పోయేవారు. అలాంటి ఇబ్బందుల నుంచి గట్టెంకించే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొబైల్ వాహనాలతో పేదల ఇంటికే వెళ్లి రేషన్ సరుకుల్ని అందజేసే విధానాన్ని తీసుకురావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'ఇంటింటికీ రేషన్' పంపిణీ విధానం అమల్లోకి రావడంతో పేదలకు శ్రమ తప్పింది. ప్రభుత్వం కొన్ని నెలల నుంచి నాణ్యమైన బియ్యాన్ని అందిస్తుండటంతో బహిరంగా మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి బియ్యాన్ని కొనుక్కోవాల్సిన అవసరం తప్పింది. దీనివల్ల కుటుంబ ఖర్చులు ఆదా అవుతున్నాయని లబ్ధిదారులు ఆనందంగా చెబుతున్నారు.

తప్పిన ఇబ్బందులు

ఇంటింటికీ రేషన్ విధానం అమలు చేయడం వల్ల లబ్ధిదారులకు సరుకులు అందేవరకు మొబైల్ వాహనం అక్కడే ఉంటోంది. రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందనే సమాచారం కూడా ముందుగానే ఇస్తుండటం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతోంది. గతంలో పంపిణీ చేసే బియ్యంలో రాళ్లు, నూకలు ఎక్కువగా ఉండేవి. ఆ బియ్యం ముక్కిపోయిని వాసన వస్తుండంతో చాలామంది వండుకుని తినేందుకు ఉపయోగించుకునేవారు కాదు. ప్రస్తుతం నాణ్యమైన బియ్యం అందిస్తుండటంతో పేదలు వాటినే వండుకు తింటున్నారు. దీనికి తోడు సరుకులు ఇంటింటికీ ఇచ్చేందుకు ప్రభుత్వం సమకూర్చిన వాహనాలతో లబ్ధిదారులు రేషన్ సరుకుల కోసం ఎదురుచూడాల్సిన పనిలేకుండా ఇళ్ల వద్దకే వచ్చి సరుకులు పంపిణీ చేస్తున్నారు. వాహనంలోనే లబ్ధిదారుల ముందు సరుకులు తూకం వేసి అందజేస్తుండటంతో తూకాల్లో ఎలాంటి అవకతవకలు లేకపోవడం వరంగా భావిస్తున్నారు.

మండలం	రేషన్ దుకాణాలు	మొబైల్ వాహనాలు	తెల్ల రేషన్ కార్డులు
ఆళ్లగడ్డ	55	16	24,634
చాగలమర్రి	39	11	15,694
దొర్నిపాడు	19	6	9,147
రుద్రవరం	39	9	15,367
శిరివెళ్ల	40	9	18,379
ఉయ్యాలవాడ	24	5	9,801

పులి పాదముద్ర కలకలం



పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం:మండల కేంద్రం రుద్రవరం సమీపాన ఉన్న గుమ్మకొండ హుసేనయ్య స్వామి దర్గా వెనుక నుంచి అటవీ ప్రాంతం వైపు పులి వెళ్లినట్లు గురువారం రైతులు పాద ముద్రలను గుర్తించారు. వెంటనే విషయాన్ని అటవీ అధికారులకు తెలిపారు. రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు, సెక్షన్ అధికారి నాగరాజు సిబ్బందితో వెళ్లి పులి పాముద్రలను పరిశీలించారు. అటు వైపు ఉన్న రైతులకు పులి అడవిలోకి వెళ్లిందని, ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెప్పారు. తిరిగి పులి సంచరించినట్లుగా పాద ముద్రలు ఉంటే సమాచారం అందించాలని కోరారు. ఆహార అన్వేషణలో కానీ, దాహం తీర్చుకోవడానికి కానీ వచ్చి ఉండవచ్చని రైతులకు తెలియ జేశారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టినమూనాలను సేకరిస్తున్న దృశ్యం

రుద్రవరం:మట్టి నమూనాల సేకరణపై మండల వ్యవసాయాధికారి జ్యోతి గురువారం గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఆలమూరు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం పరిధిలో పట్టి నమూనాలను సేకరించామన్నారు. పరీక్షల అనంతరం ఫలితాలను బట్టి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్లు పాతండి

- రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్లు పాతాలని రాష్ట్ర భూ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ కలెక్టర్లకు సూచించారు. గురువారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రాష్ట్రంలో జరుగుతున్న రీ సర్వే ప్రగతిపై ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి దశలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ ప్రగతి, పాస్ పుస్తకాల ప్రింటింగ్, హద్దురాళ్లు పాతడం, జీసీపీ మార్కింగ్, చెకింగ్ పాయింట్స్ గుర్తింపు, డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల పంపిణీ, సెక్షన్(13) నోటిఫికేషన్ల ప్రగతి తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ సాయిప్రసాద్ మాట్లాడుతూ రీసర్వే, హద్దురాళ్ల ప్లాంటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫేజ్-2 కింద చేపట్టిన రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ కొరకు అవసరమైన అదనపు రోవర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించినప్పటికీ పనుల్లో జాప్యం జరుగుతోందని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వర రావు, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరాం పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల పెంపే ధ్యేయం

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



చాగలమర్రి మండలం బ్రాహ్మణపల్లిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: పేదల స్థితిగతులు, జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేపడుతున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి చాగలమర్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు వివరిస్తూ, స్థానిక సమస్యలను అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించారు. జగనన్న పాలనలో ప్రతి ఇల్లూ, ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలతో సుభిక్షంగా ఉన్నాయన్నారు. గత టీడీపీ హయాంలో ఎంత బడ్జెట్ ప్రవేశ పెట్టేవారో ఇంచుమించు ఇప్పుడూ అదే బడ్జెట్ ప్రవేశపెడుతున్నారని, ఇప్పుడు ఉన్నన్ని పథకాలు అప్పుడు చంద్రబాబునాయుడు ఎందుకు అమలు చేయలేదో టీడీపీ నాయకులను నిలదీయాలన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాలు, పచ్చ మీడియా రోత రాతలు పట్టించుకోకుండా సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ మహేశ్వరి, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, కుమార్‌రెడ్డి, ఆశీర్వాదమ్మ, పత్తి నారాయణ, లక్ష్మీరెడ్డి, నరసింహులు, మండల అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: మండలంలోని పేరాయిపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు(54) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపిన సమాచారం.. పంటలు, ఇతర అవసరాల నిమిత్తం చేసిన అప్పులు తీర్చలేక శ్రీనివాసులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత బలవన్మరణం

జూపాడుబంగ్లా: కుటుంబ కలహాలతో తరిగొపుల గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది.ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. కరివేన గ్రామానికి చెందిన వాణికి, తరిగోపుల గ్రామానికి చెందిన ఎల్ల మద్దయ్యకి రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇప్పటి దాకా సంతానం కలుగలేదు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఏర్పడటంతో వాణి మనస్తాపానికి గురైంది. దీంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబీకులు గుర్తించి కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆసుపత్రి వద్దకు చేరుకొని మృతురాలి బంధువుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

పశుగ్రాసం దగ్ధం

మహానంది: బుక్కాపురం మజరా గ్రామమైన పుట్టుపల్లెలో గురువారం పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామానికి చెందిన కొల్లి తులశమ్మ పాడి పశువుల కోసం వివిధ పంట పొలాల నుంచి పశుగ్రాసం సేకరించి నిలువ చేసుకోగా అగ్ని ప్రమా దం చోటు చేసుకోవడంతో మొత్తం కాలిబూడిదైంది. ఈ ఘటనలో సుమారు రూ.1.50లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

వార్డుల అభివృద్ధికి కృషి చేయండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

నంద్యాల(సిటీ): పట్టణంలో ప్రతి వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అధికారులకు సూచించారు. గురువారం 27వ వార్డు దేవనగర్-2ను సందర్శించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి, డ్రైనేజీ తదితర సమస్యలు ఉన్నట్లు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్యాంకర్ల ద్వారా తాగు నీరు అందించాలన్నారు. పారిశుధ్య లోపం లేకుండా ప్రతి రోజు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్ జైనాబీ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు ప్రయోజనం

గోస్పాడు: భూసార పరీక్షలతో రైతులకు ప్రయోజ నం చేకూరుతుందని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ అన్నారు. మండలంలోని నెహ్రూ నగర్‌గ్రామ రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన భూ పరీక్ష శిక్షణలో ఆయన మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణ-భూసార పరీక్షలపై రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు,రసాయన మందుల వాడితే భూసారం తగ్గుతుందన్నారు.భూసార ఫలితాలను బట్టి ఎరువులు, మందులు వాడితే భూసా రం పెరుగుతుందన్నారు.

వ్యవసాయ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



పశువుల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు:మహానంది వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్‌విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులుగురువారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో పశువులను పరిశీలించి వాటికి వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యాధికారులు కిశోర్‌కుమార్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు.పశువులకు టీకాలు వేయడం, కృత్రిమ గర్భధారణ, నట్టల నివారణ, చెవి పోగులు వేయడం తదితర వివరాలను డాక్టర్లు విద్యార్థులకు తెలియజేశారు.వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, డాక్టర్లు మాధవి, రమేష్‌బాబు, జయసింహారెడ్డి, పీడీ యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందును తినిపిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

ఇఫ్తార్ విందు

నంద్యాల(అర్బన్): శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పట్టణ పరిసర ప్రాంతాల్లోని 13 మసీదుల్లో ముస్లింలకు ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. దేవనగర్ నూరాని మసీదు, వీసీ కాలనీ అబూబకార్ మసీదు, ఉప్పరి పేటలోని అంటికోట మసీదుల్లో రోజా దారులతో కలిసి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి విందు ఆరగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ హిందూ ముస్లింల ఐక్యతకు నంద్యాల ప్రాంతం ప్రతీకగా నిలుస్తుందన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఐఎంఏ సభ్యులు

ఐఎంఏ ఆధ్వర్యంలో..

నంద్యాల(వ్యవసాయం): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో గురువారం ముస్లింలకు స్థానిక హైదర్ హాస్పిటల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, పట్టణ అధ్యక్షుడు డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ షబ్నం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మహానంది: వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నాయకులు అన్నారు. మహానంది ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఐడీపీ కింద ఎంపికయ్యారు. వీరిని సుమారు ఆరు దేశాలకు పంపించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికా, దుబాయ్, థాయిల్యాండ్, మలేషియా, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో సాంకేతిక అంశాలు, ఇతర ఉద్యోగ అవకాశాల్లో ప్రావిణ్యత పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ ఎంఎల్ రాహుల్, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు




ఉయ్యాలవాడలో వెలవెలబోతున్న ప్రధాన రహదారి

ఉయ్యాలవాడ: భానుడు భగభగ మండిపోతున్నాడు. ఈ నెల మొదటి వారం నుంచే ఎండలు జనాన్ని భయపెడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు ఎక్కువ కావడంతో ప్రజలు అల్లాడుతున్నారు. గురువారం మండలంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటలు దాటితే ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి శివలింగమ్మ సూచించారు.

వడబెబ్బ లక్షణాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు

☛ 102 డిగ్రీలు జ్వరం, తీవ్ర తలనొప్పి, దప్పిక ఉండి నాలుక పిడుచుకట్టకపోవడం.

☛ జ్వరం తగ్గినా నీరసంగా ఉండటం.



శివలింగమ్మ, వైద్యాధికారిణి, పెద్దయమ్మనూరు

☛ ఉదయం 11 గంటల్లోపు సాయంత్రం 5 గంటల తరువాత బయట పనులు పూర్తి చేసుకోవాలి.

☛ తాగు నీరు అందుబాటులో ఉచుకోవాలి. రోజుకు 5 లీటర్లకు తక్కువ లేకుండా తాగాలి.

☛ నూనె, కొవ్వు పదార్థాలు తగ్గించాలి.

☛ పండ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరినీరు ఎక్కువగా తీసుకోవాలి.

☛ వడదెబ్బ సోకిన వ్యక్తులకు చల్లటి నీరు తాపకూడదు. నీడ ప్రదేశంలో పడుకోబెట్టి సాధారణ కుండనీరు తాపించాలి. తడిగుడ్డతో శరీరం బాగా తుడవాలి.

☛ జ్వరం మాత్రలు వేయడంతో పాటు ఓఆర్ఎస్ అవసరమైన ఐవీప్లూయిడ్స్ ఇవ్వాలి.

☛ ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పుతో కలిపిన గ్లూకోజు తాపించాలి.

☛ ప్రథమ చికిత్స అనంతరం దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించాలి.

☛ లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు వేసవిలో వాడాలి.

☛ అత్యవసరమైన సమయాల్లో బయటకు వెళ్లవలసి వస్తే గొడుగు లేదా టోపీ ధరించాలి.



నంద్యాల మండలం కానాల గ్రామంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.
- నంద్యాల